క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి కి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అర్చకులు అభిషేక పూజలు చేసి ప్రత్యేక పుష్ప, పత్రాల తో అలంకరించారు. స్థానికులతో పాటు, సి. బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు రథోత్సవం



ఉత్సవానికి సిద్ధంగా ఉన్న రథం

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తిలో నవరత్నాల లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల కల్యాణం, రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా విచ్చేయనున్నారు.

నేడు ఓర్వకల్లులో బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎద్దులు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు తొలి ఆరు స్థానాలకుగాను వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు ఉదయం 8 గంటలలోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440347812, 8333007780, 9440882949 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గిరిజన గురుకుల బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. క్రిష్ణానాయక్ తెలిపారు.శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ తరగతిలో 27 సీట్లు, ఐదవ తరగతిలో 20 సీట్లు, ఆరవ తరగతిలో 15 సీట్లు, ఏడో తరగతిలో 6 సీట్లు, ఎనిమిదో తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.ఆయా తరగతుల్లో ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 9959758919, 833300229కు సంప్రదించాలని సూచించారు.

పశుగ్రాసం దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. శనివారం పాలెం గ్రామానికి చెందిన రైతు అశోక్ పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా పాణ్యంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ తహసీల్దార్ కార్యాలయం వరకు ట్రాక్టర్ తీసుకువెళ్లారు. మంటలు మరింత పెరగడంతో కార్యాలయం ముందే పశుగ్రాసాన్ని అన్‌లోడ్ చేయడంతో ప్రమాదం తప్పింది.

పార్కును అభివృద్ధి చేస్తాం

కల్లూరు: 19వ వార్డు పరిధిలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో మున్సిపల్ పార్కును అభివృద్ధి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆమె పార్కును సందర్శించి, మొక్కలు నాటారు. అనంతరం కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కని ఉచిత బస్సు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సర్కార్ మీనమీషాలు
- అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా కార్యరూపం దాల్చని హామీ
- సర్కారు తీరుపై మహిళల ఆగ్రహం
- బాబును నమ్మి మోసపోయామని ఆవేదన



కర్నూలు(రూరల్): ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు సూపర్–6 హామీలతో ఊదరగొట్టాయి. నమ్మి ఓటేసిన ప్రజలకు అధికారంలోకి వచ్చాక చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. సూపర్–6లో ప్రధానమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నేటికీ రోడ్డెక్కలేదు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తయినా హామీకి మోక్షం లభించకపోవడంతో మహిళలు పెదవివిరుస్తున్నారు. అమలు చేయలేనప్పుడు ఎన్నికల సమయంలో హామీలు ఎందుకివ్వాలని పాలకులను ప్రశ్నిస్తున్నారు.

బాబు మార్క్ రాజకీయం

ఉచిత బస్సు హామీ అమలు చేస్తే మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు అని మహిళలు పెదవి విరుస్తున్నారు.ఎన్నికల సమయంలో మహిళల ఓట్ల కోసం చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దానిని అటకెక్కించారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు మరోసారి తన నైజాన్ని ప్రదర్శించారని మహిళలు మండిపడుతున్నారు. పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు వివిధ పనుల మీద నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని వాపోతున్నారు.

కాలయాపన

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీలపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. రవాణ శాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్ట్ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని లీకులు ఇచ్చారు. ఎప్పుడు అమలు చేస్తారోనని మహిళలు ఎదురుచూస్తున్నారు.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే హామీ

కోడుమూరు నియోజకవర్గంలో కర్నూలు రూరల్, కోడుమూరు, గుడూరు, సి.బెళగల్ మండలాలు ఉన్నాయి. ఇందులో 70 గ్రామ పంచాయతీలు ఉండగా 1,23,691 మంది మహిళలు ఉన్నారు. వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలోని 60 గ్రామ పంచాయతీలు నుంచి నిత్యం ఆస్పత్రులు, వ్యవసాయ కూలీ పనులకు, కాలేజీలకు చిరువ్యాపారాలకు మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందని ఆశించారు. అయితే వారి ఆశలు అడియాసలయ్యేలా ప్రభుత్వ వ్యవహరిస్తోంది.

ఉచిత బస్సు హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో ఉచిత బస్సు ప్రయాణమంటే నమ్మాం. అధికారంలో వచ్చి 10 నెలలు దాటినా అమలు చేయడం లేదు. ఇప్పటికైనా కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని పక్కాగా అమలు చేశాయి. మన రాష్ట్రంలో ఆ ఊసే ఎత్తక పోవడం శోచనీయం. కనీసం ఎప్పటి నుంచి హామీని అమలు చేస్తారో ప్రకటించాలి.

– రమణమ్మ ఉల్చాల గ్రామం

హామీల ఊసే ఎత్తడం లేదు



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం మహిళల ఓట్లను ఆకర్షించేందుకు అనేక హామీలు ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని పది నెలలు గడిచినా హామీ నేరవేరలేదు. దసరా, సంక్రాంతి, ఉగాది అంటూ చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు. అలాగే ప్రతి మహిళలకు నెలకు రూ1,500 అంటూ హామీ ఇచ్చారు. దాని గురించి పట్టించుకోవడం లేదు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా ఇప్పటివరకు సరిగా అమలు చేయలేదు.

–భాగ్యమ్మ గార్గేయపురం

వెంటనే అమలు చేయాలి



అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి మండలకేంద్రాలకు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుచేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా, కాదా అని కూటమి నాయకులు ఆలోచన చేయాలి. అధికారంలోకి వచ్చాక అధ్యయనం, విధివిధానాల పేరుతో కాలయాపన చేయడం సరికాదు. ఏదిఏమైనా ఉచిత బస్సు హామీని సర్కారు తక్షణమే అమలు చేయాలి.

–మహేశ్వరి, ఈ తాండ్రపాడు గ్రామం

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

- కోడుమూరులో సైనికుల తల్లులకు పోలీసుల పాదపూజ



సైనికుల తల్లులను సత్కరిస్తున్న కోడుమూరు సీఐ, ఎస్ఐ



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

కోడుమూరు రూరల్: దేశం కోసం యుద్ధం చేస్తున్న వీర సైనికుల సేవలు మరువలేనివని.. దేశరక్షణ కోసం బార్డర్‌లో పోరాడుతున్న సైనికులకు ప్రజలంతా రుణపడి ఉండాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. శనివారం సాయంత్రం కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఎర్రిస్వామి పోలీస్ సిబ్బందితో కలిసి పట్టణానికి చెందిన సైనికుడు అనీల్‌కుమార్‌తో పాటు, సునీల్, వినోద్ అనే సైనికుల తల్లులకు పాదపూజ చేశారు. దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం బార్డర్‌లో ప్రాణాలొడ్డి పోరాడుతున్న సైనికుల సేవలు ఎంతో విలువైనవన్నారు. మన దేశంలో చొరబడి 26మంది భారతీయులను చంపి మన ఆడబిడ్డల సిందూరాన్ని తొలగించిన తీవ్రవాదులను, వారికి మద్దతు నిస్తున్న పాకిస్తాన్‌ను తుదముట్టించేందుకు భారత దేశం కొనసాగిస్తున్న ఆపరేషన్ సింధూర్‌కు ప్రజలంతా అండగా ఉండాలని సీఐ పిలుపునిచ్చారు. దేశ రక్షణకు అహర్నిశలు పాటుపడుతున్న సైనికుల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఎస్ఐ ఎర్రిస్వామి మాట్లాడుతూ.. మన దేశంలో అక్రమంగా చొరబడి మన ఆడబిడ్డల సింధూరాన్ని తుడిచివేసిన తీవ్రవాదులపై మన సైనికుల చేస్తున్న యుద్ధానికి ప్రజలంతా మద్దతు తెలియజేయాలన్నారు. అంతకుముందు పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్‌కు పోలీసులు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీర జవాన్‌కు జోహార్లు

పాణ్యం: యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం పాణ్యం పోలీసు స్టేషన్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్థాన్‌ను కోలుకోకుండా దెబ్బతీయాలన్నారు. కార్యక్రమంలో మాజి సైనికులు వనం వెంకటాద్రి, క్రిష్ణయ్య, ఎస్ ఎం మాలిక్‌బాషా, కైలాస్‌పతి, లక్ష్మన్న, హవల్దార్, మురారి లక్ష్మన్న, జవమూర్ ఉసేన్ పాల్గొన్నారు.

- యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ మురళీ నాయక్‌ను పాణ్యం సీఐ, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ నరేంద్రకుమార్‌రెడ్డి నివాళి అర్పించి మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

కమనీయం.. చెన్నకేశవుడి కల్యాణం





ఓర్వకల్లులో చెన్నకేశవస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, నన్నూరులో శ్రీలక్ష్మి సమేత మద్దిలేటి స్వామికి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, సాయంత్రం స్వాముల వారికి బలిహరణం పూజలు నిర్వహించి, తెల్లవారు జామున మీనలగ్నంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు నారాయణరావు, విష్ణుశర్మ ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలతో అలంకరించి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకను వీక్షించారు. సాయంత్రం దేవయాగం, బలిహరణం పూజలు నిర్వహించి, శేష, హనుమ వాహనాలపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, గ్రామ పెద్దలు కాశిరెడ్డి. వెంకటరామిరెడ్డి, చెన్నూరు వెంకటరమణారెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి కల్యాణం

మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆదిచింతలమునిి, నల్లారెడ్డి దేవాలయంలో శ్రీలక్ష్మి సమేత మద్దిలేటి నరసింహ స్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ, గ్రామపెద్దల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భజన పోటీలు



బహుమతులు స్వీకరిస్తున్న భజన బృందం

మండల కేంద్రం ఓర్వకల్లు చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన భజన పోటీలు నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించిన ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 10 భజన బృందాలు పాల్గొన్నాయి. ఇందులో ఓర్వకల్లు మండలం, ఉయ్యాలవాడ చెందిన మూల పెద్దమ్మ భజన బృందం తొలి బహుమతి రూ.20 వేలు, బేతంచెర్ల మండలం, శంకరాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర భజన బృందం రెండవ బహుమతి రూ.15 వేలు గెలుచుకున్నాయి. కర్నూలు నగరంలోని గణేష్‌నగర్‌కు చెందిన అభయాంజనేయ భజన బృందం మూడవ బహుమతి రూ.10 వేలు, వెల్దుర్తి మండలం, పుల్లగుమ్మి గ్రామానికి చెందిన వీరభద్రేశ్వరస్వామి భజన బృందం నాల్గవ బహుమతి రూ.5 వేలు, వెల్దుర్తి మండలం , కలుగోట్లకు చెందిన అమ్మరాముల భజన బృందం ఐదవ బహుమతి రూ.3 వేల చొప్పున కైవసం చేసుకున్నాయి. ఈ భజన పోటీలకు రామలింగయ్య, వెంకప్ప, కోటేశ్వరరెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మదన్‌సింగ్

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లికి చెందిన పాలగిరి భాస్కర్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో సొంత పనిమీద హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు.గడివేముల మండలం గని గ్రామానికి చెందిన మదన్‌సింగ్, స్వర్ణసింగ్ అనే ఇద్దరు వ్యక్తులు మద్దిలేటయ్యస్వామిని దర్శించుకొని బైక్‌పై వెళ్తుండగా హుసేనాపురం యూటర్న్ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్లుతున్న మదన్‌సింగ్‌కు కాలు విరగగా మరోవ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదతీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.





ఆదమరిస్తే అంతే

గడివేముల: మండల కేంద్రం గడివేముల నుంచి బొల్లవరం వెళ్లే రోడ్డు దెబ్బతినింది. ఈ దారిలో అధికంగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే, ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల రోడ్డు కోతకు గురైంది. బొల్లవరం సమీపంలో ఏకంగా రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు అనైతికం

కర్నూలు(సెంట్రల్): సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం అనైతికమని యునైటెడ్ జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలం సత్యనారాయణ, చిన్న రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, చంద్రమోహన్ శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా ఇంట్లోకి చొరబడి తనిఖీలు చేసిన ధోరణి దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

నేడు జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్: కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాలకు చెందిన జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాప్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు డోన్‌లోని శ్రీసుధ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ రాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజాసైన్స్ ఉద్యమం – తాత్వికత ప్రస్తుత కర్తవ్యాలు అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జన విజ్ఞాన వేదిక నిర్మాణం కొన్ని ప్రాధాన్యతలు అనే అంశంపై డాక్టర్ గేయానంద్ ఉపన్యసిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల ఆందోళన



సీహెచ్‌ఓలకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. వెంగళ్‌రెడ్డి

- మద్దతు తెలిపిన ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): డిమాండ్ల పరిష్కారం కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వోలు) గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న ఆందోళన శనివారం కూడా కొనసాగింది. స్థానిక ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.వెంగళ్‌రెడ్డి, ఇతర నాయకులు వచ్చి సీహెచ్‌వోలకు మద్దతు తెలిపారు. వారి డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీ ఎంసీఏ ప్రెసిడెంట్ చందన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తాము చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుందని, కానీ ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, చర్చలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్స్‌లో భాగంగా 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, తాలూకా అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, నగర అధ్యక్షులు కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, కోడుమూరు తాలూకా అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం కార్యదర్శి బంగారి, ఏపీ ఎంసీఏ వర్కింగ్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, సెక్రటరి నాగరాజు, ట్రెజరర్ కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.

దేశానికి సేవలు అందించేందుకు సిద్ధం



దేశానికి సేవలు అందించేందుకు సిద్ధమని ప్రకటిస్తున్న మాజీ సైనికులు

కర్నూలు(అగ్రికల్చర్): ఇండియా–పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మాతృదేశానికి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నూలు మాజీ సైనికులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు దేశానికి సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న మాజీ సైనికుల పేర్లతో కూడిన జాబితాను పంపామని మాజీ సైనికులు ప్రకటించారు. యుద్ధ సమయంలో దేశానికి సేవలు అందించేందుకు మరికొంత మంది ఆసక్తితో ఉన్నారని, వీరితో త్వరలోనే రెండవ జాబితాను పంపుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ నుంచి ఎపుడు ఆదేశాలు వచ్చినా దేశ సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో ఎటువంటి బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

అగ్ని ప్రమాదం

కర్నూలు : కర్నూలు శివారు బీక్యాంప్‌లోని టీజీ ఫంక్షన్ హాల్ దగ్గర ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద జనరేటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం జనరేటర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అగ్ని మాపక సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అయినప్పటికీ రూ.1.9 లక్షలు నష్టం వాటిల్లినట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు అంచనా వేశారు.

పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి



డీఆర్‌ఎంకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: పాణ్యం రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లను నిలపాలని, రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాకు స్థానికులు వినతి ప్రతం అందించారు. గుంతకల్లు, నంద్యాల మధ్యలో జరుగుతున్న డబ్లింగ్ పనులను పరిశీలించేందుకు శనివారం డీఆర్‌ఎం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు రమణయ్య, శ్రీనివాసులు, శంకరయ్య తదితరులు కలిసి పాణ్యం రేల్వే స్టేషన్ పరిధిలో అనేక పరిశ్రమలు, పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని వెల్లడించారు.